క్లుప్తంగా

గడ్డివామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

రాజుపాళెం: మండల కేంద్రమైన రాజుపాళెంలో మంగళవారం సాయంత్రం గడ్డివామి దగ్ధమైంది. కాచన జయచంద్రారెడ్డికి మినుము, శనగ పొట్టుతో వామి వేసుకున్నాడు. మంగళవారం ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో వామి అగ్నికి ఆహుతైంది. ప్రొద్దుటూరు అగ్నిమాపక యంత్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

హోంగార్డు మృతి



హోంగార్డు మరియన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ఆర్‌ఐ శ్రీశైలంరెడ్డి

కలసపాడు: మండలంలోని హృదయపేటకు చెందిన సగిలిమరియన్న (58) మరియన్న కలసపాడు పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నారు. సోమ వారం ఆకస్మికంగా మృతి చెందారు. జిల్లా హోంగార్డు విభాగం ఇన్‌చార్జి ఆర్‌ఐ శ్రీశైలంరెడ్డి, పలువురు హోంగార్డులు, ఇతరులు మరియన్న మృతదేహాన్ని మంగళవారం సందర్శించి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. శ్రీశైలంరెడ్డి మాట్లాడుతూ హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నాగమురళి పాల్గొన్నారు.

రూ.1.40 లక్షల నగదు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె చెక్ పోస్టు వద్ద మంగళవారం రూ.1.40 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌కు చెందిన రామాంజ నేయులు బొలేరో క్యాంపర్ వాహనంలో ప్రొద్దుటూరుకు వెళుతుండగా గోపాయపల్లె చెక్ పోస్టు వద్ద తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో ఎటువంటి రశీదులు లేని రూ.1.40 లక్షల నగదును సీజ్ చేశామన్నారు. ఈ డబ్బును కడప ట్రెజరీ కార్యాలయానికి పంపించామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



మైలవరంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ గోపాల్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జమ్మలమడుగు రూరల్ సీఐ కె.గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మైలవరం మండల కేంద్రంలో ఆయన సాయుధ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఏ మాత్రం గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యే నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో మైలవరం ఎస్‌ఐ రెడ్డి సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు

వైవీయూ: పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కడప నగరంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం. అనూరాధను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మూల్యాంకనంలో పాల్గొనే ఉపాధ్యాయులకు చల్లని నీరు, మజ్జిగ తదితర సౌకర్యాలను సమకూర్చాలని కోరారు. పదోతరగతికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యతగా విధుల్లోకి తీసుకోవాలని, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని విధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి. శేషగిరి రావు, జిల్లా అధ్యక్షుడు ఎం. గంగరాజు, జిల్లా కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

వైభవం.. అంకాలమ్మ బ్రహ్మోత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అంకాలమ్మ



బండలాగుడు పోటీల్లో బండలాగుతున్న వృషభాలు

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామ సమీపాన సగిలేరు ఒడ్డున వెలసిన అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు బి.కోడూరు మండలం నుండే కాకుండా పోరుమామిళ్ల, బి.మఠం మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆలయ ధర్మకర్తలు ఓ.ప్రభాకర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి, బోడుగుండుపల్లెకు చెందిన సుడి బండ్లు భక్తులను ఆకట్టుకున్నాయి. కేశాపురం గ్రామానికి చెందిన నగదు, కుంకుమ బండి పలువురినీ ఆకర్షించింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కులుకు భజన, కోలాటం ఆకట్టుకున్నాయి. బి.కోడూరు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

మున్నెల్లి అంకాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన బండలాడుగు పోటీలను ఆలయ ధర్మకర్తలు జగదీశ్వర్‌రెడ్డి, ఓ.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా కొండపేట గ్రామానికి చెందిన కశయ్యకి చెందిన వృషభాలు బుసిరెడ్డి రాజనారాయణరెడ్డి అందజేసిన రూ.40,116లు మొదటి బహుమతిని, నంద్యాల జిల్లా మూదురాళ్లపల్లె గ్రామానికి చెందిన పులిచిన్న ఓబుల్‌రెడ్డికి చెందిన వృషభాలు సి.నాగేశ్వర్‌రెడ్డి అందజేసిన రూ.20,116ల రెండవ బహుమతిని, కడప జిల్లా నారసపురం గ్రామానికి చెందిన కామినిప్రతాప్‌రెడ్డికి చెందిన వృషభాలు బోరెడ్డిచెన్నారెడ్డి అందజేసిన రూ.10,116ల మూడవ బహుమతిని గెలుచుకున్నాయి. ఈ బహుమతులను ఆలయ ధర్మకర్తల చేతుల మీదుగా వృషభ యజమానులకు అందజేశారు.

• విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగర్, త్యాగరాజ కాలనీ సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి స్ఫటిక శివాలయ ప్రథమ వార్షికోత్సవం, కాల భైరవ సహిత దక్షిణమూర్తి నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామికి గణపతిపూజ, కలశ స్థాపన నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం జరిపారు. కళాకారుల కోలాటం భక్తులను ఆకట్టుకుంది. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్‌లకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్ రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, కౌన్సిలర్ దుద్దుకూరుసత్యం, రజనీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ గానుగపెంటమురళి, ఆలయ అర్చకులు సత్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

• గ్రామోత్సవం



స్వామివారి గ్రామోత్సవం

బద్వేలు అర్బన్ : మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, కామసముద్రం హర్షబాబు, మెంటా చంద్రయ్య, పెద్ద వీరయ్య, రమణమ్మ, లక్ష్మమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్నగురవయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలు మరవద్దు



ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

- మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి
- ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పోరుమామిళ్ల : ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని, మాట నిలబెట్టుకున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ కోరారు. పట్టణంలోని బెస్త వీధి, రంపాడు రోడ్డులో ప్రజా దీవెన కార్యక్రమం, ఇంటింటి ప్రచారం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో టీడీపీ మ్యానిఫెస్టోలో 600కు పైగా హామీలిచ్చినా అధికారం లోకి వచ్చాక ఒక్కటీ అమలుచేయలేదన్నారు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ ఒక్కటిగా ప్రజలను మభ్య పెడుతూ, మోసపూరిత హామీలతో ముందుకు వస్తున్నారని, ఆ దుష్ట కూటమిని చిత్తుగా ఓడించాలన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా అవినీతి లేని పాలన అందించారని, మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధలను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీయం బాష, రాజశేఖర్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, ఈశ్వరమ్మ, రాజీవ్‌బాష, సాయి నారాయణరెడ్డి, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, రాళ్లపల్లె రవికుమార్, నరసింహులు, అల్లా, గంగన్న, రమణారెడ్డి, ఇస్సాక్, గురప్ప, మణి, షరీఫ్, మస్తాన్, నాయుడు, రాము, నారాయణ, కృష్ణ, రామ్మోహన్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి చూపుతారా?

- వైఎస్.రాజశేఖరరెడ్డి, జగన్ హయాంలోనే అభివృద్ధి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు ఆయన తనయుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే ప్రొద్దుటూరులో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న వరదరాజులరెడ్డి గతంలో ఆ పార్టీ చేసిన అభివృద్ధి ఏమిటో చూపాలని కోరారు. స్థానిక శేగిరెడ్డి గంగిరెడ్డి స్వగృహంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని మంజూరుచేసినా అప్పట్లో టీడీపీ ఇన్‌చార్జిగా వరదరాజులరెడ్డి ఎందుకు పనులు ప్రారంభించలేకపోయారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీ ద్వారా రూ.90 కోట్లు వెచ్చించి ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. వైఎస్ హయాంలో అమృతానగర్ నిర్మించారని, టీడీపీ హయాంలో ఒక్క ఇళ్లు అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. బిందె నీరు, ఇంటి స్థలం ఇవ్వకుండా, గత ఐదేళ్ల ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్న వరదరాజులరెడ్డి ఫిబ్రవరిలో మళ్లీ పార్టీలో చేరి టీడీపీ టికెట్ దక్కించుకున్నారన్నారు. కరోనా సమయంలో ఆయన కనిపించారా? అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రశ్నించారు. జగన్ హయాంలోనే నూతన మార్కెట్, బస్టాండ్, పెన్నానదిపై వంతెన, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్, పైపులైన్, మురుగు కాల్వల నిర్మాణ పనులు జరిగాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అసలు టీడీపీ హయాంలో ప్రొద్దుటూరుకు జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరిస్తే బాగుంటుందన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందేగానీ, మున్సిపాలిటీ నుంచి రూపాయి కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ఈ సమావేశంలో శేగిరెడ్డి గంగిరెడ్డితోపాటు 29వ వార్డు ఇన్‌చార్జి బాలా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజికుంట అంజి, 31వ వార్డు ఇన్‌చార్జి బలిమిడి చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి, ఆయన సతీమణి, కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చెప్పిన ప్రకారం పట్టణ ప్రజలకు తాగునీరు అందించామని, జగనన్న ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా వీధుల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తమకు సంక్షేమ పథకాలు అందాయని, మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి గెలిపిస్తామని ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేగిరెడ్డి గంగిరెడ్డి, మోతుకూరు జయలక్ష్మి బాలా, కోనేటి సునంద, గరిశపాటి లక్ష్మీదేవి, శారద, ప్రశాంతి, పాతకోట కృష్ణవేణి, ఉట్టి రమణమ్మ, నూరి, బండారు నూరి, గంగాధర్, గోసా మనోహర్, భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, పాతకోట బంగారు మునిరెడ్డి, లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, సానపురెడ్డి ప్రతాప్ రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికునిపై దాడి

సమ్మెకు దిగిన కార్మికులు



సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డికి రాజీనామా పత్రం ఇస్తున్న కార్మికులు

పోరుమామిళ్ల : హరిత రాయబారి ప్రేమ్‌కుమార్‌ను స్థానికుడు దేశాయి వెంకటాచలపతిరెడ్డి దాడి చేసి దూషించడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోలీసులకు, పంచాయతీ సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేసిన కార్మికులు తమ విధులు బహిష్కరించారు. మస్తాన్ మాట్లాడుతూ ఉదయం రంగసముద్రం పంచాయతీలో పనిచేస్తున్న హరిత రాయబారి ప్రేమ్‌కుమార్ ట్రాక్టర్ తీసుకొని చలపతిరెడ్డి ఇంటివద్ద చెత్త సేకరణకు వెళ్లగా, తన మాట వినలేదని కార్మికుడిని దూషించడమేకాక చేయి చేసుకోవడం నేరమన్నారు. గతంలోనూ చలపతిరెడ్డి ఇలాంటి చర్యలకే పాల్పడ్డారన్నారు. నలుగురు పంచాయతీ సిబ్బందిని అసభ్యపదజాలంతో దూషిస్తే ఎలాంటి చర్యలు లేవన్నారు. చలపతిరెడ్డిపై క్రిమినల్ కేసు పెట్టి చర్య తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి ముందు చెత్తను, మురికిని తెల్లారకముందే ఎత్తి వేస్తున్న పారిశుధ్య కార్మికులను గౌరవించాలన్నారు. సమస్య ఉంటే పంచాయతీ కార్యదర్శికి లేదా సర్పంచ్‌కు చెప్పాలన్నారు. ఈ సంఘటనతో తాము సమ్మె చేస్తున్నట్లు సర్పంచి రవిప్రకాష్‌రెడ్డికి, కార్యదర్శి రాజీవ్‌రెడ్డికి మూకుమ్మడి రాజీనామా పత్రం ఇవ్వడంతో సర్పంచ్ శాంతింపజేశారు.

కృష్ణారెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే ఓదార్పు

ఖాజీపేట : మండలంలోని ఆంజనేయకొట్టాలు గ్రామానికి చెందిన పాణ్యం కృష్ణారెడ్డి (75)అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కృష్ణారెడ్డి భౌతిక గాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంభసభ్యులను మృతికి గలకారణాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు.

ఈకార్యక్రమంలో ఎపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచ్ పెద్దిరెడ్డి, పుల్లూరు మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం: పట్టణంలోని టీబీ రోడ్డులో నివాసముంటున్న ఎర్రదాసరి తేజస్విని (28) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల వివరాల మేరకు తేజస్విని మూడో సచివాలయం పరిధిలో వాలంటీర్‌గా పని చేస్తోంది. చిన్నతనంలో ఆమె తల్లి, కరోనా సమయంలో తండ్రి చనిపోయాడు. దీంతో తేజస్విని ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమెకు గత కొద్దిరోజులుగా నెలలలో ఒకటి, రెండు సార్లు మూర్ఛ వస్తుంటుందని బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని సీఐ రామాంజులు గ్రామస్థులకు నాయకులకు విజ్ఞప్తి చేశారు. ముత్తులూరు పాడు, దుంపలగట్టు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని తెలిపారు. ఎవ్వరైనా హింసకు పాల్పడినా, రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఒక్కసారి ఎన్నికల్లో సమస్యలు సృష్టిస్తే వారు పోలీసు రికార్డుల్లో ఉంటారని సూచించారు. ఎవ్వరి ఓటు వారు వేసుకుని సహకరించాలని సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండలంలోని డొంకపల్లె గ్రామంలో మంగళవారం స్థానికుల సమచారం మేరకు పేకాట అడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసి వారినుంచి రూ.13,300 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు.

ఆర్టీపీపీ సీఈకి వినతి

ఎర్రగుంట్ల : ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగులకు బయో మెట్రిక్ అటెండెన్స్‌ను వేతనాలకు లింక్ చేసే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని అన్ని యూనియన్ల అసోసియేషన్స్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీ సీఈ గౌరీపతికి వారు వినతిపత్రం అందజేశారు.

టీడీపీకి షాక్..

ఎమ్మెల్యేను కలిసిన రవిశంకర్‌రెడ్డి..!



ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో టీడీపీ ముఖ్య నాయకుడు రవిశంకర్‌రెడ్డి

చాపాడు : మండలంలోని తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఆ పార్టీ ముఖ్య నాయకుడు లింగిరెడ్డి రవిశంకర్‌రెడ్డి మంగళవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సొంత మండలమైన చాపాడు మండలంలో 2014లో వైఎస్సార్‌సీపీలో ఉన్న టీఓపల్లెకు చెందిన ఎల్.రవిశంకర్‌రెడ్డి ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. ఐదేళ్ల పాటు టీడీపీలో కొనసాగిన రవిశంకర్‌రెడ్డి 2019 ఎన్నికలలో టీడీపీలో ముఖ్య నాయకుడిగా కొనసాగారు. ఈ క్రమంలో 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం బ్రహ్మంగారిమఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని రవిశంకర్‌రెడ్డి కలిశారు. ఇక నుంచి వైఎస్సార్‌సీపీలో కొనసాగుతానని, ఇక్కడే తనకు తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యేకు తెలిపారు. ఆయన చేరికతో టీడీపీకి పెద్ద షాక్ తగలనుందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆత్మహత్యలపై న్యాయ విచారణ చేపట్టాలి



డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామంలో చోటుచేసుకున్న చేనేత కుటుంబానికి చెందిన వారి ఆత్మహత్యలపై కలెక్టర్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ చేపట్టాలని అఖిల పక్ష నాయకులు మంగళవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మృతుని కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు భూమిని ఆన్‌లైన్‌చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలన్నారు. ఒక్కొక్క మృతునికి రూ. 25 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. భూ అక్రమాలకు పాల్పడిన అప్పటి తహసీల్దార్, రెవెన్యూ అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లు వెంట ఎంపీటీసీ సౌభాగ్యమ్మ



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో ఎంపీటీసీ సౌభాగ్యమ్మ

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని 5వ వార్డు ఎంపీటీసీ యనమల సౌభాగ్యమ్మ మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సర్పంచ్ శివచంద్రారెడ్డి వెంట ఉన్న ఈమె, ప్రస్తుతం ఎమ్మెల్యే పక్షంలో చేరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లెల రాజారాంరెడ్డి, వేంపల్లె సురేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా కొనసాగించాలి



ట్రాన్స్ కో ఎస్‌ఈకి వినతి పత్రం అందిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు పంచాయతీ పరిధిలో వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్తు సరఫరా కొనసాగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీ.రమణ పేర్కొన్నారు. మంగళవారం ట్రాన్స్ కో జిల్లా ఎస్‌ఈని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో పంట పొలాలకు కేవలం నాలుగు గంటలే విద్యుత్తు సరఫరా ఉందన్నారు. యథావిధిగా ఏడు గంటల పాటు ప్రసారం చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఏపీ రమణ తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు

చాపాడు : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ మండల కేంద్రమైన చాపాడులోని ప్రొద్దుటూరు రోడ్డులోని సీపీఎస్‌ఆర్, సీబీఆర్ కాంప్లెక్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీలను, ఆ పార్టీ జెండాలను అధికారులు తొలగించి రంగులు వేయించారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, ఆ పార్టీ జెండా దిమ్మె రంగులపై మంగళవారం సాక్షి దిన పత్రికలో 'జెండా తీయించారు.. నేతల పోస్టర్లను మరిచారు.. టీడీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన 'పేరుతో కథనం వెలువడింది. దీనిని స్పందించిన పంచాయతీరాజ్, రెవెన్యూ అధికార యంత్రాంగం అప్రమత్తమై టీడీపీ కార్యాలయం వద్ద ఉన్న టీడీపీ, జనసేన పార్టీ నాయకుల పోస్టర్లను తొలగించి, బయట ఉన్న పార్టీ జెండా దిమ్మెకు తెలుపు రంగు వేయించారు. ఎన్నికల కోడ్ నిబంధనలను అమలుపరిచిన అధికారులు తీరుపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



చాపాడులో టీడీపీ కార్యాలయం వద్ద పోస్టర్లు



తొలగించిన అనంతరం ఇలా..



చాపాడులో టీడీపీ కార్యాలయం బయట పసుపు రంగులో జెండా దిమ్మె (నాడు)



జెండా దిమ్మెకు తెలుపు రంగు వేసిన అధికారులు (నేడు)